## క్లుప్తంగా

### రేపు 'డయల్ యువర్ డీఎం'

**మదనపల్లె సిటీ:** మదనపల్లె-1,2 డిపోల పరిధిలోని ఆర్టీసీ బస్సుల వల్ల కలిగే ఇబ్బందులు, సమస్యలు పెంచుకొనుట, సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఈనెల 21న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సమస్యలను 9959225676 ద్వారా ఫోన్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు.

### ఆలయం కూల్చేందుకు అనుమతి ఇవ్వండి

**రామసముద్రం:** మండలంలోని కురిజన గ్రామంలో ఉన్న పురాతన ఆలయాన్ని కూల్చేందుకు అనుమతి ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్, ఎస్ఐకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు గ్రామంలో ఉన్న శ్రీచెన్నరాయస్వామి ఆలయం పడిపోయే పరిస్థితిలో ఉందన్నారు. ఆలయాన్ని కూల్చేసి కొత్తగా నిర్మాణం చేయాలని గ్రామస్తులు, అర్చకులు సంకల్పించామన్నారు. దీనికి అనుమతి ఇవ్వాలని కోరారు.

### 'మత్తుకు బానిస కావద్దు'

**పెద్దతిప్పసముద్రం:** చదువుకునే వయస్సులో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోరాదని ఎస్ఐ నరసింహుడు హితబోధ చేశారు. సోమవారం ఆయన మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మమేకమై పలు సూచనలిచ్చారు. విద్యార్థినులను వేధించడం, సెల్‌ఫోన్‌లకు, డ్రగ్స్‌లకు అలవాటి పడిన ఎందరో చిన్న వయస్సులోనే వారి నిండు జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారని విచారం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసే దిశగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

### ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

**మదనపల్లె సిటీ:** స్థానిక వెలుగు పాఠశాలలో సోమవారం మదనపల్లె ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరయ్యారు. దివ్యాంగులు, వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీకి 15 కొత్త అద్దెబస్సులు

**మదనపల్లె సిటీ:** మదనపల్లె ఆర్టీసీ-1 డిపోకు 15 కొత్త బస్సులు రానున్నాయని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి బెంగళూరుకు నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు, కడప రెండు ఎక్స్‌ప్రెస్‌లు, వేలూరుకు ఒక ఎక్స్‌ప్రెస్, బి.కొత్తకోటకు రెండు అల్ట్రా డీలక్స్ బస్సులు, తంబళ్లపల్లెకు మూడు పల్లె వెలుగు, బి.కొత్తకోటకు రెండు పల్లె వెలుగు, కదిరి ఒక పల్లెవెలుగు బస్సు మంజూరైనట్లు తెలిపారు. అలాగే ఆర్టీసీ సంస్థ ద్వారా హైదరాబాద్‌కు రెండు సూపర్‌లగ్జరీ బస్సులు, కడప ఒకటి, బెంగళూరుకు రెండు ఎక్స్‌ప్రెస్‌లు బస్సులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కొత్త బస్సు సర్వీసులతో ప్రయాణికులకు మరింత సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు.

### నేటి నుంచి ఓటర్ల జాబితా పరిశీలన

**కురబలకోట:** మండలంలో మంగళవారం నుంచి బీఎల్‌ఓలచే ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలన నిర్వహించనున్నట్లు తహసీల్దారు జీ. తపస్విని సోమవారం తెలిపారు. జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. గ్రామస్థులు బీఎల్‌ఓలకు సహకరించాలని కోరారు.

### వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

**వాల్మీకిపురం:** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 23వ తేది నుంచి జరగనున్న గ్రామ సభలు, సభల నిర్వహణ, చేపట్టాల్సిన అంశాలు, వికసిత్ భారత్, ఉపాధి హామీ పథకం తదితర పథకాలు అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర రాజు, తహసీల్దార్ పామిలేటి, ఈవో ఉదయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### 21న త్యాగమూర్తిశర్మ సంస్మరణ సభ

**మదనపల్లె సిటీ:** ప్రముఖ రచయిత, పురాణం త్యాగమూర్తిశర్మ సంస్మరణ సభ ఈనెల 21వతేదీన నిర్వహిస్తున్నట్లు ప్రజాచైతన్య స్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు తెలిపారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు జరిగే సంస్మరణ సభకు సాహితీ అభిమానులు, శర్మ అభిమానులు పాల్గొనాలని కోరారు.

### అధికారులకు సత్కారం

**బి.కొత్తకోట:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బి.శ్రీధర్‌రావు, సీఐ రాజారెడ్డి, ఎంపీడీఓ శంకరయ్యలను సోమవారం బీజేపీ నేతలు వేర్వేరుగా శాలువ, పూలమాలలతో సత్కరించారు. మండల ప్రజలకు సేవలు అందించి మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమాల్లో గోపాల్‌రెడ్డి, శోభారాణి, రాందాస్, గోరంట్ల రమేష్, రవీంద్ర, గోపి, శంకర మూర్తి, షౌకత్‌అలీ, బావాసాబ్ పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాటేస్తున్న ప్లాస్టిక్ భూతం

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగం
- కాలువలు, రోడ్లపక్కన కుప్పలు కుప్పలుగా దర్శనం
- కలుషితం అవుతున్న భూగర్భజలం

**ఇది మన పట్టణం. దీనిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్లాస్టిక్ విచ్చలవిడిగా వాడకం వల్ల గుట్టలుగా పేరుకుపోతున్నాయి. నీటి వనరుల్లోనూ ఇవి కలిసిపోవడం వల్ల భూగర్భజలం కలుషితం అవుతోంది. వీటి నుంచి విడుదల అయ్యే హానికర రసాయనాల వల్ల ఆరోగ్యం పాడువుతుంది. ఏక వినియోగ ప్లాస్టిక్ వాడకాన్ని ఆపాలి. దీని వల్ల మనం భావితరాలకు మేలు చేసిన వారమవుతాం.**


కోమటివానిచెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

**మదనపల్లె సిటీ:** మదనపల్లె పట్టణంలో మళ్లీ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం పెగిగిపోయింది. కాలువలు,డ్రెయిన్లు, రోడ్ల పక్కన ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి.పూలు,పండ్లు, కూరగాయాలు, ఫ్యాన్సీ, హోటళ్లు, టిఫన్ సెంటర్లు, తోపుడుబండ్లు.. ఒకటేమిటి అన్ని చోట్లా ఈ సంచులే వినియోగిస్తున్నారు. గతంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం ప్రకటించారు.అయితే తూతూ మంత్రంగా అప్పుడప్పుడు దాడులు చేసిన కేసులు రాసి చేతులు దులుపుకున్నారు. తర్వాత మళ్లీ మొదటికి వచ్చింది. మున్సిపాలిటీలో రోజుకు రెండు వేల కిలోల ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు సాగుతున్నాయి.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే...**

బస్టాండులు: చిత్తూరు, బెంగళూరు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. నిత్యం ప్రయాణికులు వస్తుంటారు. ఈప ప్రాంతంలో ఏం కొనుగోలు చేసినా ప్లాసిక్ కవర్లనే వాడుతున్నారు.

**డ్రైనేజీ, కాలువల్లో..**

పట్టణంలోని బుగ్గకాల్వ, బాహుదా, కురవంక కాలువల గట్టుపై ఎక్కడా చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే. వ్యర్థాలు తొలగించాలంటే జెసీబీలు వాడుతున్నారు. ఎక్కడెక్కడో వాడిన ప్లాస్టిక్ కవర్లు కొట్టుకుని కాలువుల్లో నిలబడిపోతున్నాయి. స్థానిక కదిరి రోడ్డులో డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుకోవడంతో డ్రైనేజీ కాలువ మూసుకుపోయింది. చిన్నపాటి వర్షం కురిసినా ప్లాస్లిక్ వ్యర్థాల వల్ల కాలువల్లో నీరు రోడ్లపై పొంగిపొర్లుతుంది. దీంతో డ్రైనేజీ నీరు బయటకు పోకపోవడంతో రోడ్లపై నే పొంగిపొర్లుతున్నాయి.దీంతో దర్వాసన వెదజల్లుతోంది.

**విచ్చలవిడిగా వినియోగం**

పట్టణంలో ప్రధానంగా బెంగళూరు,చిత్తూరు,నీరుగట్టువారిపల్లె, సొసైటీకాలనీ, నిమ్మనపల్లె క్రాస్ ప్రాంతాల్లో తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్లు నిత్యం ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారు. నాన్ వెజ్ హోటళ్లు, బిరియ్యాని హోటళ్లు , కర్రీపాయింట్లు, ప్లాస్టిక్ కవర్లు ఎక్కువ వాడుతున్నారు. ఎక్కడ చూసినా వీటి వినియోగం ఎక్కువగా జరుగుతోంది. వివాహాలు జరిగే కళ్యాణ మండపాల్లో సైతం ప్లాస్టిక్ వినియోగం ఎక్కువ జరుగుతోంది.

**తయారీ నుంచే నిరోధించాలి**



క్యారీ బ్యాగులపై నిషేధం పక్కాగా అమలు చేయాలి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో వీటి వినియోగం ఎక్కువగా ఉంది. చిల్లర, హోల్‌సేల్ దుకాణాదారులపై చర్యలు తీసుకునే ముందుగా తయారు చేసే దగ్గరే వాటిని ఆపాలి. అప్పుడు మార్కెట్లోకి రాకుండా ఉంటాయి. మార్కెట్‌లో దొరకడం వల్ల ప్రజలు సులభంగా వాడేస్తున్నారు.

-తిరుపతిరావు,
టౌన్ అఫెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

# అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

**– సబ్ కలెక్టర్ మేఘస్వరూప్**


సబ్ కలెక్టర్‌కు ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం విన్నవిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

**మదనపల్లె :** ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు డివిజన్‌లోని 11 మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ప్రజాసమస్యలను నేరుగా తెలుసుకున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

**హోంగార్డులకు ఇంటిస్థలాలు**

మదనపల్లె మండల హోంగార్డు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇళ్లస్థలాల కోసం 2009లో దరఖాస్తు చేసుకోగా, బసినికొండ గ్రామం సర్వేనెం.718/4బిలోని 3 ఎకరాల భూమిలో 718/13గా సబ్‌డివిజన్ చేసి 1.15 ఎకరాలకు అలియనేషన్ ప్రతిపాదనలు పంపారన్నారు. అయితే 2018లో ప్రభుత్వం హోంగార్డులు పేదలకు ఇళ్ల పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని జీఓ విడుదల చేసిన నేపథ్యంలో గతంలో అలినేషన్‌కు ప్రతిపాదనలు పంపిన బసినికొండ గ్రామంలోని 718/13లోని 1.15 ఎకరాల స్థలాన్ని తమకే కేటాయించాల్సిందిగా సబ్ కలెక్టర్‌కు వినతిచేశారు.

**మూడుచక్రాల వాహనం మంజూరు చేయండి**

మదనపల్లె నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేఅవుట్‌కు చెందిన చేనేత కార్మికుడైన చిన్నకోట్ల వెంకటరమణ ఎడమకాలు దెబ్బతగలి పూర్తిగా పనిచేయకపోవడంతో నడిచేందుకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో తనకు మూడుచక్రాల బ్యాటరీసైకిల్, ఇంటిస్థలం మంజూరుచేయాలని కోరారు.

**పరిహారం ఇప్పించండి**

ఎన్‌హెచ్-340 నిర్మాణంలో భాగంగా అంగళ్లగ్రామంలోని సర్వేనెంబర్.237లో సేకరించిన భూయజమానులందరికీ నష్టపరిహారం అందిందని, తన 300 చదరపు అడుగులకు మాత్రం నేషనల్ హైవే అధికారులు ఎటువంటి పరిహారం చెల్లించలేదని రైతు పి.వెంకటరమణారెడ్డి సబ్ కలెక్టర్‌కు విన్నవించాడు. పలుమార్లు అర్జీలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదని, పరిహారం సొమ్ము ఇప్పించాల్సిందిగా కోరాడు.

**ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించండి**

మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు సబ్ కలెక్టర్‌కు వినతిచేశారు. మదనపల్లెలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మిస్తే..సమీప నియోజకవర్గాలైన పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి తదితర ప్రాంతాల కార్మికులకు అనుకూలంగా ఉంటుందన్నారు. అలాగే మదనపల్లె మున్సిపాలిటీలో నెలకున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యను పరిష్కరించాలని వర్రిసురేష్‌కుమార్, నాగరాజులు కోరారు.

# ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి


కలకడ: ప్రసంగిస్తున్న ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి

**కలకడ :** ప్రతి ఏడాది వార్షిక ప్రణాళిక సిద్ధం చేసుకుని, ఆ ప్రణాళిక ఆధారంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు ముందుకు వెళ్లినప్పుడే గ్రామాలు, పంచాయతీలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి పంచాయతీల అభివృద్ధి కోసం మూడు రోజులు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వనున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రతి కుటుంబం నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. వీధి దీపాలు, నీటిసౌకర్యం గురించి , పంచాయతీలలో అమలు చేసే కార్యాక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి లతీఫ్‌ఖాన్, సర్పంచ్‌లు జిల్లా రాజగోపాల్‌రెడ్డి, విశ్వనాథ్, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**రామసముద్రం:** రామసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో భానుప్రసాద్, సర్పంచ్‌ల అధికారాలు, విధులు, బాధ్యతలు గురించి వివరించారు. అలాగే ఘనవ్యర్థపదార్థాల నిర్వహణపై సూచనలు, సలహాలు అందజేశారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు శిక్షణ తరగతులకు విధిగా హాజరువలసిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి సుధాకర్ రెడ్డి, మండల పరిపాలన అధికారి రమణ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**పెద్దమండ్యం:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణా తరగతులను ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక ప్రణాళిక గురించి ట్రైనర్‌లు వివరించారు. శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, ఎస్ బాబా, పీరాన్‌బి, విశ్వనాధరెడ్డి, జింకా విశ్వనాధ, టి జయమ్మ, పి భారతి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

**పెద్దతిప్పసముద్రం:** ప్రభుత్వం ద్వారా మజూరయ్యే నిధులతో ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీర్చి దిద్ది ప్రజల మన్ననలను పొందాలని ఎంపీపీ మహమూద్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజల్వన అనంతరం ఎంపీపీ పై విధంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కేఎస్ బాలాజీ, ఈవోఆర్డీ యోగానంద, ఏపీవో తిరుపాలప్ప, కార్యదర్శులు కలసి గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీల పాత్ర తదితర అంశాలపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు.

### 21 నుంచి శంకరయ్య ఉత్సవాలు

**బి.కొత్తకోట:** మండలంలోని శంకరాపురంలో వెలసిన శంకరయ్య స్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 21న ప్రారంభమై 24 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల భజనలు, అఖండ రామకోటి, నిత్య పూజలు, అభిషేకాలు, హోమాలు, సహస్ర నామార్చన, మహా మంగళహారతి, పూర్ణాహుతి, భక్తుల ఆరాధన తదితర కార్యక్రమాలు జరుగుతాయి. దీని కోసం కమిటి ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించగా చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం జిల్లాలు, సరిహద్దులోని కర్ణాటకకు చెందిన భక్తులు తరలివస్తారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు.

### మౌలిక వసతులకు ప్రాధాన్యత


ఎంపీ మిథున్‌రెడ్డిని సత్కరిస్తున్న హబీబ్‌బాషా

**పీలేరు :** సమష్టి కృషితో పీలేరులో తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ మిథున్‌రెడ్డి సూచించారు. సోమవారం సోమవారం తిరుపతిలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి, మాజీ మంత్రి, పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు శ్రీనాథరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, పరమేష్, నాగభూషణం , కాలేషా, అబీద్, సాంబశివారెడ్డి, నాగరాజ నాయక్, సచిన్, ఎంపీటీసీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

### 29న మండల మీట్

**పెద్దమండ్యం:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం 29న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు. అలాగే మండలంలోని ఆయాశాఖల అధికారులు అభివృద్ధి పనుల వివరాలతో తప్పని సరిగా సర్వసభ్య సమావేశానికి రావాలన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు, ఆయాశాఖల అధికారులకు సమచారం అందించినట్లు తెలిపారు.

### 'ఇసుక దోపిడీకి ఆధారాలుంటే చూపించాలి'

**మదనపల్లె :** టీడీపీ నాయకులు ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు చేసిన ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలని టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోందన్నారు. మదనపల్లె ప్రాంతంలో ఇసుక రీచ్ లేనందున, భవన నిర్మాణాలకు అవసరమైన వ్యక్తులు రైతులతో మాట్లాడుకుని, సొంతపొలాల్లో నుంచి ట్రాక్టర్‌లతో పట్టణంలోకి ఇసుకను తరలించడం జరుగుతోందన్నారు. దీన్ని సాకుగా చూపి సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఇసుకదోపిడీ జరుగుతోందంటూ పత్రికాప్రకటనలు, ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, షంషీర్, నాగవేణి, నిమ్మనపల్లె జయన్న తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉపాధిహామీ బహిరంగసభ

**తంబళ్లపల్లె:** ఉపాధి హామీ సామాజిక బహిరంగ సభ మంగళవారం నిర్వహించనున్నట్లు ఏపీఓ ఆంజనప్ప తెలిపారు. మార్చి 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు జరిగిన పనులను పదో విడతలో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారు. తనిఖీ వివరాలను బహిరంగసభలో ప్రజల ముందు వెల్లడిస్తారని ఏపీఓ తెలిపారు.

# పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

**మదనపల్లె :** విరివిగా మొక్కలు నాటి పరిరక్షిస్తేనే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. హరిత మదనపల్లె కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని రెడ్డీస్‌కాలనీ భాష్యం స్కూల్ వెనుకప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరై మొక్కను నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకప్పుడు మదనపల్లె పట్టణం పచ్చదనానికి, ప్రశాంత వాతావరణానికి, ఆహ్లాదతకు మారుపేరుగా ఉండేదన్నారు. నేడు ఎక్కడ చూసినా పెద్ద పెద్ద వృక్షాలను సైతం తొలగించి నిర్మాణాలు చేయడంతో కనుచూపు మేర ఎక్కడా పచ్చదనం కనిపించడం లేదన్నారు. ఎండ తీవ్రత అధికమై, వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా, పట్టణాన్ని హరిత మదనపల్లెగా తీర్చిదిద్దే ధ్యేయంతో 50,000 మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా చేపట్టామన్నారు. పట్టణ ప్రజలందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులుగా చేస్తూ, మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ బాధ్యతను అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కొడవలిశివప్రసాద్, బాలుస్వామి, పఠాన్ మహమ్మద్‌ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి**

**మదనపల్లె :** ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎలాంటి లోటుపాట్లున్నా సరిదిద్దుకోవాలని, లబ్ధిదారులందరికీ రేషన్ పంపిణీ సక్రమంగా జరపాల్సిన బాధ్యత వీఆర్వోలు, రేషన్‌డీలర్లదేనని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో రేషన్‌డీలర్లు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రేషన్ పంపిణీపై ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, సకాలంలో నిత్యావసర సరుకులు అందడం లేదని తనవద్దకు వస్తున్నారన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం కనపరిస్తే సహించేది లేదన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీని వీఆర్వోలు పర్యవేక్షించాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ఇళ్లవద్దకే వెళ్లి కార్డుదారులందరికీ సరుకులు అందించేలా చూడాలన్నారు. తహసీల్దార్ ఖాజాబీ, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, సివిల్ సప్లయిస్ డీటీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌ఓసీ ఉంటేనే విద్యుత్ కనెక్షన్

**–డిస్కం ఈఈకి కమిషనర్ లేఖ**

**బి.కొత్తకోట:** బి.కొత్తకోట పట్టణం, మండలంలో ఇటీవల కాలంలో గృహాలకు ఇచ్చే విద్యుత్ కనెక్షన్ల విషయంలో డిస్కం అధికారులు నో అబ్జక్షన్ సర్టిఫిట్ (ఎన్‌ఓసీ) ఉంటేనే ఇవ్వాలన్న విధానం అమలు చేయాలని కోరుతూ డిస్కం మదనపల్లె ఈఈ, స్థానిక ఏఈలకు కమిషనర్ పీఆర్.మనోహర్ లేఖ రాశారు. ఇటీవల బి.కొత్తకోట పట్టణంలో వివాదాస్పద, కోర్టు కేసులు నడుస్తున్న, ప్రభుత్వ, పంచాయతీ స్థలాల్లో నిర్మాణాలు చేసిన వాటికి డిస్కం అధికారులు విద్యుత్ సరఫరా మీటర్లను ఏర్పాటు చేశారు. దీని వల్ల ప్రభుత్వ, నగర పంచాయతీ ఆస్తులు అన్యాక్రాంతమైతే వాటికి అధికారికంగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం ద్వారా ఆక్రమణదారులకు ప్రయోజనం చేకూరుతుంది. దీనితో పాటు ప్రభుత్వం పట్టాలు ఇవ్వని, ఎక్కడపడితే అక్కడ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్న వారికి డిస్కం అధికారులు కనీస విచారణ లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేశారు. కొన్నింటిపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో స్పందించిన కమిషనర్ మనోహర్ లేఖ ద్వారా విద్యుత్ సరఫరా కనెక్షన్ ఇచ్చే ముందు నగర పంచాయతీ నుంచి ఎన్‌వోసీ కోరాలని, వాటిని పొందిన వారికే ఇవ్వాలని లేఖలో సూచించారు. తద్వారా ప్రభుత్వ స్థలాలను కాపాడటంతో పాటు వివాదాస్పద, కోర్టు కేసుల్లో ఉన్నవాటి జోలికి వెళ్లకుండా ఉండే అవకాశం ఉంటుందని సూచించారు. దీనికితోడు నగర పంచాయతీలో అక్రమ నిర్మాణాలను అరికట్టడం, ప్రతిక్కరూ ఇంటిప్లాను అనుమతి పొందడానికి అవకాశం ఉంటుందని కమిషనర్ మనోహర్ తెలిపారు.

# అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

**– సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు**


జిల్లా ఆస్పత్రిలో పరిసరాలను తనిఖీ చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు


**మదనపల్లె :** జిల్లా ఆస్పత్రి పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు హెచ్చరించారు. సోమవారం ఆయన ఆస్పత్రి పరిసరాలను తనిఖీ చేశారు. ఆవరణలో మద్యం బాటిళ్లను గుర్తించారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బందిని పిలిచి మందలించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మరోసారి ఆస్పత్రి పరిసరాల్లో ఇలాంటివి పునరావృతమైతే పాల్పడే వారితో పాటు సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సెక్యూరిటీ సిబ్బందితో పాటు అవుట్‌పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆస్పత్రి స్థాయి పెరిగిన నేపథ్యంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌లో సిబ్బంది సంఖ్యను పెంచాల్సిందిగా డీఎస్పీని కోరినట్లు చెప్పారు. అనంతరం అత్యవసర విభాగంలో వైద్యసేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# బి.కొత్తకోట ఈఓపై అభియోగాల నమోదు


ఆలయ భూములు పరిశీలిస్తున్న విశ్వనాథ్

**బి.కొత్తకోట:** బి.కొత్తకోటలోని చౌళేశ్వరస్వామి ఆలయ భూమిలో ఇసుక తరలింపు వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్థానిక ఆలయాల ఎగ్జిక్యూటివ్ అధికారి ఎ.మునిరాజపై అభియోగాలను నమోదు చేశామని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ సోమవారం చెప్పారు. ఆలేరువాగు సమీపంలోని ఆలయ భూమిలో ఇసుక తరలిపోయిన విషయమపై స్థానికులు లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా కమిషనర్ ఆదేశాలతో విచారణకు వచ్చినట్లు చెప్పారు. చౌళేశ్వర ఆలయ భూమిలో ఇసుక తరలింపుపై ఇచ్చిన మొదటి నివేదిక ఆధారంగా ఈవో మునిరాజుకు మూడు షోకాజ్ నోటీసులు జారీ చేసి అభియోగాలు నమోదవగా మళ్లి రెండో నివేదికను కమిషనర్‌కు పంపుతున్నట్టు చెప్పారు. దీనిపై ప్రభుత్వం ఈవోపై చర్యలు తీసుకోనుందని చెప్పారు. పదేళ్లుగా ఇక్కడ ఈఓలుగా పనిచేసిన వారి వివరాలు, భూమిని లీజుకు తీసుకున్న వ్యక్తుల వివరాలను సమగ్రంగా సేకరించి నివేదిక సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.

# ఘనంగా రాఖీ పౌర్ణమి


ఎస్ఐ నాగేశ్వరరావుకు రాఖీ కడుతున్న విద్యార్థిని

**వాల్మీకిపురం:** రక్షాబంధన్ సందర్భంగా స్థానిక పోలీసులు, సిబ్బందికి విద్యార్థులు రాఖీలు కట్టి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మీరే మా నమ్మకం, మీరే మా రక్ష, రక్షాబంధన్ శుభాకాంక్షలు సర్ అంటూ చెప్పడంతో పోలీసులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టి, ఉన్నత స్థితికి ఎదగాలని ఆశీర్వదించారు.

**మదనపల్లె సిటీ:** పట్టణంలో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇళ్లల్లో అక్కలు తమ్ముళ్లకు,చెల్లెళ్లు అన్నలకు రాఖీలు కట్టి ఆశ్వీర్వాదం తీసుకున్నారు. స్థానిక గాంధీపురంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు మహిళలు రాఖీలు కట్టారు. పలు పాఠశాలల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు:**

స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని స్వామిని టమటా అలంకారంలో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# సీఐ, తహసీల్దార్‌లకు సన్మానం


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**వాల్మీకిపురం:** ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు, తహసీల్దార్ పామిలేటిని సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురికి పూలమాలలు వేసి, దుశ్శాలవతో సన్మానించారు. అలాగే మాలమహానాడు నాయకులు కూడా వీరిని కలసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో నాయకులు కేశవ రెడ్డి, ఆనంద, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, మహేష్, మునిభాస్కర్, శ్రీరాములు, మధనమోహన్‌రెడ్డి, రఘు, శ్రీనివాసులు శెట్టి, రాజేష్, రాజా బాబు, విశ్వనాథ్, మాలమహానాడు నాయకులు సుధాకర్, మహేష్, శివయ్య, వెంకటస్వామి, వీరభద్ర, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతికి మించి ప్రయాణిస్తే చర్యలు

**కలకడ :** వాహనాలు అతివేగంగా నడిపినా, పరిమితికి మించి ప్రయాణించినా పోలీస్ కేసులు, చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు హెచ్చరించారు. సోమవారం చిత్తూరు-కర్నూలు జాతీయరహదారిపై మండలంలోని కె.బాటవారిపల్లె పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో వాహనాల రికార్డులు తనిఖీ చేశారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను తరలించిన ఆటో డ్రైవర్లుకు జరిమానా విధించారు. ప్రయాణికులతో మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, క్షేమం అన్నారు. బస్సు సౌకర్యం లేని గ్రామాలకు ఆటోలలో వెళ్ళినా సీటు పరిమితి మేరకు కనీస భద్రత కల్పించాలన్నారు. కారులో సీటు బెల్టు ధరించని వారికి, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. నిత్యం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్డుపై వాహనాలు నిలుపరాదని హెచ్చరించారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**పీలేరు రూరల్:** ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 12 అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు వారం లోపు పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలన్నారు.

**గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలి**

**కేవీపల్లె :** మండలంలోని మఠంపల్లె పంచాయతీ కలికిరివాండ్లపల్లెలో పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా గిరిజనులు గుడిసెల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. వారు నివాసం ఉన్న స్థలంలోనే పక్కా మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు చెంగన్న, దొర, పాపయ్య, కుమార్ పాల్గొన్నారు.